# అన్నయ్య

"శోభశ్రీ"

—— (౦) ——

"రిక్షా పిలు తమ్ముడూ!" అన్న పిలుపుతో నా ఊహలన్నీ పటాపంచలైపోయాయి. "తమ్ముడూ!" అన్న పదమే నా హృదయంలో పదేపదే పలికిందిగాని దాని వెనుకమాటలు వినబడలేదు. చిత్తరపోయి ఆయన, "మా అన్నయ్య" వంక చూచాను. ఆ ముఖంలో మూర్తీభవించిన ముగ్ధత్వం, సుహృద్భావం, ప్రేమ నా కళ్ళకనుపాపల్లో కలిసిపోయాయి.

"రిక్షాపిలు నాన్నా!" తిరిగి ప్రేమతో రెట్టించాడు.

దబదబా బయటకు నడిచాను బరువైన గుండెతో.

♦ ♦ ♦

ఆ రోజు మా ప్రక్క భాగంలోకి ఎవరో క్రొత్తగా అద్దెకొచ్చారని తెలుసుకొన్నప్పుడు, క్రొత్తవారితో స్నేహమాబోతోందని ఉర్రూతలూగాను.

నూతన పరిచయ భాగ్యం ఏనిముషాన కలుగుతోందా అని కలలు కంటున్న సమయమది.

"రవి!" అన్న పదంతో వెనుదిరిగాను, ఆశ్చర్యంగా, క్రొత్త గొంతుక ఎవరిదోనని.

నా హృదయంలో ఒక అల ఉవ్వెత్తుగాలేచి తిరిగి యథాస్థానానికొచ్చింది.

"అయితే! ... మా ప్రక్క భాగంలో క్రొత్తగా చేరిన అపరిచితుడు ... ఆశ్చర్యపడటంలో అసహజం లేదుగదూ? నా కళ్ళు ఆయన కళ్ళల్లో దేనికోరకో వెతికాయి ... అవీ అంతేనేమో! ఎందుకో ఒకే క్షణంలో ఇద్దరి పెదిమలమీద చిరునవ్వు చిందులాడింది."

"ఏం చదువుతున్నావయ్యా?" తిరిగి అదే కంఠంతో ఒక ప్రశ్న.

"ఇంటరు ... మొదటి సంవత్సరం!" నా జవాబు, అదే మా పరిచయానికి నాంది!

♦ ♦ ♦

ఆయనే మా అన్నయ్య! ఆమె మా వదిన!!

"ఈ అబ్బాయి ఎవరు?" అనే ప్రతి ప్రశ్నకు "నా తమ్ముడు!" అని గర్వంతో జవాబిచ్చేవాడు.

ఆ మాటంటుంటే ఆ ముఖంలో నూతనజ్యోతి వింతకాంతులతో వెలిగేది.

కాని నా మోము చిన్నబోయేది! కారణం ... అనూహ్యం, అపసవ్యం, ఆశించదగ్గదిగాదా జవాబు. ...

కారణ మీయనికి తెలుసు ... నాకు తెలుసు.

దానికి నాలోనే నేను క్రుగ్గి, కృంగి కృశించిపోతున్నాను ... ఆయన ఆ బాధను హృదయంలోనే యిముడ్చుకొని, చెరగని చిరునవ్వుతో, కాలాన్ని గడుపుతున్నాడని ఊహించాను.

అది తలుపుకొచ్చినప్పుడల్లా నాలో అగ్నిపర్వతాలు పగులుతయి ... లావా ప్రవహిస్తుంది ... సముద్రాలకుప్పెన వస్తుంది ... దేశాలు ధ్వంసమౌతయి ... కాని ఎవరు కనిపెట్టలేరాస్థితిని — కాని చదువరులే దానిలోని నిజానిజాల్ని గ్రహించి, నన్ను దూషించినాసరే, లేక నిష్కపటంతో నిట్టూర్పువిడచి నిష్క్రమించినా సరే!

♦ ♦ ♦

"తమ్ముడూ!" అని ఆయన నోటినుండి వచ్చే పదంలో అమృతం చిలుకుతుంది.

"అబ్బా!" ఆ అమృతాన్ని గ్రోలి సంతోషాన్ని ఆస్వాదించగలశక్తి నాలో లేకపోయిందిగదా!

కాని ... కాని ... నేను తిరిగి ఆయనను, ఆ

శాంతమూర్తిని, దయాపరుని, "అన్నయ్యా!" అనే పదంతో సత్కరించలేకపోతున్నాగదా!

మా ప్రక్క భాగంలో జేరిన తరువాత ప్రథమ పరిచయంతోనే "ఏమండీ!" అనే పిలుపే నాలో నిబిడీకృతమైపోయింది.

వారు ప్రేమతో పిలిచిన "తమ్ముడూ!" అనే పదానికి నా జవాబు "ఏమండీ!" యేనా? ఇదేనా న్యాయం??

అట్లా పిలిచినప్పటికి నా నాలుకకు తూట్లుపడలేదు ... శరీరం విచ్ఛిన్నమవ్వలేదు, హృదయం ఆక్రోశించలేదు — కాని అన్నిటికి మిన్నయైన ఆత్మ వజ్రప్రహారంతో సహస్రముక్కలైపోయేది.

"నాకు అన్నయ్యలేని కొరతను తీర్చాడు ... నేనూ అంతే!"

♦ ♦ ♦

నాకు ఒక రోజు తీవ్రమైన జ్వరమొచ్చింది. మూసినకన్ను తెరవకుండా అలానే పడుకొని వున్నాను. నూటఒకటి ... రెండు ... నాలుగు ... జ్వరం పెరిగిపోతోంది ... టైఫాయిడ్ అని డాక్టర్లు చెప్పారు చాటుగా పెద్దవాళ్లతో. ...

అది పదుహేనవరోజు ... ఏమాత్రం నాలో జ్వరం వెనుకంజవేయలేదు. కన్నీటితో, బరువైన కళ్ళలో మా అన్నయ్య, వదిన కనబడ్డారు నాకు.

"త్వరలోనే తగ్గుతుంది తమ్ముడూ!" మంచం మీద నా ప్రక్కగా కూర్చుంటూ అన్నాడాయన.

ఆయన మనస్సులోగూడ రెండు శక్తులు అద్వితీయంగా పోరాడుతున్నయ్యని, ఆయన ముఖమే చెబుతోంది.

నా శరీరం శుష్కించిపోతోంది. శక్తినంతా కూడగట్టుకొని "ఏమండీ! మీ ప్రియమైన తమ్ముడిని మర్చిపోరుగదూ?"

మా వదిన చటుక్కున లేచి నా నోరు మూసింది. నా యీ పాపిష్టినోరు ఆ సమయంలో గూడ "అన్నయ్యా"! అని పిలువలేకపోయింది! నన్ను నేనే తిట్టుకున్నాను. వంద చెంపపెట్లు పెట్టుకున్నాను. అటువంటి నా నోటిమీద పవిత్రమైన మా వదిన చేయి ఉండటం ఇష్టంలేక, "వదినా! జ్ఞాపకం వుంటానా?" అంటూ ఆమె చేతిని నా చేత్తో తీసివేశాను.

"బాబూ! తప్పుకదూ! నీవు నూరేళ్ళు జీవిస్తావు నాన్నా!" అన్నది కళ్ళుమూసుకొని ఆ మాతృమూర్తి.

♦ ♦ ♦

ఆ దీవెనే ఫలించింది. -నాకు త్వరలోనే స్వస్థత చేకూరింది. తిరిగి కొద్దికొద్దిగా తిరగటం మొదలు పెట్టాను.

కాని నా మనోవేదన కంతులేదు ... నా ఆత్మను నా చేతిలోకి చిక్కించుకోలేకపోతున్నాను ... "ఆయనను" — "అన్నయ్య" - అని పిలువలేకపోతున్నాను ... అదే నాలోని ఆవేదన... దానితో గూడిన ఆలోచన కంతులేదు.

"ఈ రోజున మా అన్నయ్యను "అన్నయ్య" అని పిలువవల్సిందే!" ఒక రోజు నిశ్చయంచేసుకున్నాను - సముద్రాలు పొంగినా, అగ్ని పర్వతాలు పగిలినా, ఆకాశంకూలినా, నా మనోనిశ్చయానికి మార్పులేదని శపథంచేసుకున్నాను.

"అవును, ఆయనే వస్తున్నారు... ఆఫీసునుంచి!" ఆయన యింట్లోకి వెళ్ళగానే నేనూ వెళదామనుకున్నాను. "వెళ్ళగానే ఏమి అడగాలి?" నా గొంతులోనే గుండ్రాయిలా కూర్చుంది ఆ ప్రశ్న.

అదే సమయానికి ఉదయం ఆఫీసులో ఎవరో క్రొత్త వ్యక్తితో మాట్లాడుతున్నట్లుగా చూచాను ఆ ప్రక్కరోడ్డునవస్తూ.

"ఇంకేం! ఆ ప్రశ్నే అడుగుతాను!" అనుకున్నాను, "కాదు ముందుగా మాటలన్ని వరుసగా

కూర్చుకొని, వెళ్ళిన వెంటనే తడబడకుండా అడగాలి. ... ..."

"అన్నయ్యా! ఇవాళ ప్రొద్దున ఆఫీసులో నీతో మాట్లాడుతున్నాయన ఎవరు?" బాగుంది ప్రశ్న, అనుకున్నాను ... అనుకోవడమే తరువాయి, బయల్దేరాను. వారి భాగంలో కాలుపెట్టాను.

ఆయన నేను రావటం చూచాడు.

"ఏంతమ్ముడూ ... బజారువెళ్దామా?" నిర్మలమైన మనస్సుతో అడిగాడా ప్రశ్నను ... ఆ వర్ఛస్సు, మాటలలోని మృదుత్వం, నన్ను మురిపించాయి ... నాలోని నాడులు కదిలాయి, ఆ ప్రేమ పలుకులకు. కాని సంభాళించుకున్నాను ... నా శపథం వెన్నుమీద చరిచింది!

"అ ... అ—అ . . అ ... ఏమిటండీ?" నా కళ్లు తిరిగిపోయినయి ... పడిపోతూ, రోడ్డుమీదకు పారిపోయాను — నా తల సిగ్గుతో కుంచుకపోయింది. మరెన్నడు ఈ వెధవముఖాన్ని ఆ పవిత్రమూర్తికి చూపకూడదనుకున్నాను.

నా యీ చేష్టకు నిర్ఘాంతపోయి వుంటాడని ఊహించి వూరుకున్నాను ... కాని ఆయనను చూడకుండా ఒక్క క్షణం వుండలేనుగా!!

◆ ◆ ◆

నాలుగేళ్ళు యీ ఆవేదనతోనే గడిచిపోయాయి. నా కోరిక ఫలించలేదు ... ఇంత జరుగుతున్నా, అంతా అర్థంచేసుకొని 'ఆయన' మోముమీద చిరునవ్వు మాయనీయటంలేదు.

మా యందు భగవంతుడు పూర్తిగా వ్యతిరిక్తుడయ్యాడు. నాకు విచారం కలిగించేవార్త నొకదానిని — అతిగంభీరంగా చెప్పాడు అన్నయ్య... కాని నాకు తెలుసు ఆయనపడేబాధ ... ఎవరు కనిపెట్టలేరు నేను తప్ప ...

ఆ వూరినుండి ఆయనకు బదిలీ అయింది ... వెంటనే వెళ్ళి జాయినవ్వాలి. ...

భూమ్యాకాశాలు తిరగటం స్థంభించాయా అనిపించేలా అయిపోయింది ... ఆత్మనిగ్రహశక్తి అణిగిపోయింది.

మా యిద్దరిని చూచి ఓర్వలేక భగవంతుడు దుష్టశక్తిని పంపాడా అనిపించింది ... మనస్సులో కల్లోలం ఏర్పడింది ...

వెంటనే "అన్నయ్యా!" అంటూ ఆయనమీదకు పడిపోయాను. అదే నా ప్రథమవిజయం.

"తమ్ముడూ!" అంటూ ప్రేమతో హృదయానికిహత్తుకున్నాడు మా అన్నయ్య.

మా అన్నాదమ్ములను జూచి మావదిన ఆనంద భాష్పాలు రాల్చిందనుకుంటాను ... లేకపోతే మమ్మల్ని చూస్తూ చీరచెంగుతో కళ్ళుతుడుచుకోవాల్సిన అవసరమేమొచ్చిందామెకు!

◆ ◆ ◆

"తప్పక శలవల్లో మా వూరు వస్తావుగదూ, రవీ!" మా వదిన అడిగింది.

"తప్పకుండా, వదినా"

"రావాలి తమ్ముడూ! వెళ్ళగానే అడ్రసు వ్రాస్తూ ఉత్తరం వ్రాస్తాను ... శలవలివ్వగానే వస్తే పదిరోజులుండవచ్చు." మావదిన మాటను సమర్థించాడు అన్నయ్య.

రైలుగంట మ్రోగింది ... బండి కదులుతోంది.

అనుకోకుండా చేతులుజోడించి నమస్కారం చేశా నా దంపతులకు—అదే మా అన్నయ్య, వదినలకు!

— ౦ —